**Andhra Jyothi**

# జోనల్ పద్ధతిలోనే టీచర్, గ్రూప్-2 పోస్టుల భర్తీ

హైదరాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): గురుకుల టీచర్ పోస్టులు, గ్రూప్-2 పోస్టులను జోనల్ పద్ధతిలోనే భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం ఈ పోస్టులు జోనల్ కేటగిరీలో ఉన్నందున, ఆ విధానం ప్రకారమే కొత్త పోస్టులు భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించారు. బుధవారం సాయంత్రం టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో భేటి అయ్యారు. ఈ సందర్భంగా గ్రూప్-2, టీచర్ పోస్టులపై చర్చ జరిగింది. ఈ నేపథ్యంలో గ్రూప్-2లోని 1032 పోస్టుల భర్తీకి రెండు రోజుల్లో నోటిఫికేషన్ జారీ చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి వెల్లడించారు. 1032 పోస్టుల్లో 439 పోస్టులకు ఇప్పటికే నోటిఫికేషన్ జారీ అయింది. కొత్తగా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన 598 పోస్టులకు అనుబంధ నోటిఫికేషన్ జారీ చేయనున్నారు. మరోవైపు సుమారు 5700 గురుకుల టీచర్ పోస్టుల భర్తీకి కూడా ఒకేసారి నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం సూచించి నట్లు తెలిసింది. తొలుత గ్రూప్-2, టీచర్ పోస్టులకు ఒకేసారి నోటిఫికేషన్ ఇవ్వాలని టీఎస్‌పీఎస్సీ భావించింది. అందులో భాగంగా ముందస్తుగా ప్రభుత్వం అనుమతి ఇచ్చిన 2444 టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేసి ఆ తర్వాత వివిధ సంక్షేమ శాఖల ద్వారా వచ్చిన పోస్టుల సంఖ్యను నోటిఫికేషన్‌లో కలపాలని యోచించింది.

అలా కాకుండా అన్ని శాఖల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకుని ఒకేసారి 5700 పోస్టులకు నోటిఫికేషన్ జారీ చేయాలని సీఎం సూచించినట్లు తెలిసింది. అందులో భాగంగా సీఎస్ రాజీవ్‌శర్మ గురు లేదా శుక్రవారం వివిధ సంక్షేమ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ఖాళీల వివరాలు తెప్పించే అవకాశం ఉంది. ఒకటి రెండు రోజుల్లో ఆయా శాఖల నుంచి పూర్తి వివరాలు వస్తే ఒకే రోజు గ్రూప్-2, టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అవుతుంది. లేని పక్షంలో తొలుత గ్రూప్-2 నోటిఫికేషన్ వెలువరించి, ఆ తర్వాత ఒకటి రెండు రోజుల వ్యవధిలో గురుకుల టీచర్ నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది.